జియో నెట్‌వర్క్‌లోకి 12 లక్షల కస్టమర్లు

న్యూఢిల్లీ, జనవరి 22: దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో మళ్లీ గాడినపడింది. గడిచిన నాలుగు నెలలుగా కస్టమర్లను కోల్పోయిన సంస్థ.. నవంబర్ నెలకుగాను కొత్తగా 12.1 లక్షల మంది వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లు చేరారని టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా వెల్లడించింది. దీంతో మొత్తం కస్టమర్ల సంఖ్య 46.12 కోట్లకు చేరుకున్నట్లు ప్రకటించింది. మరోవైపు, తన ప్రత్యర్థి సంస్థలైన భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా, ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ మాత్రం మొబైల్ వినియోగదారులను కోల్పోయాయి. భారతీ ఎయిర్‌టెల్ 11.4 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు కోల్పోగా, వొడాఫోన్ ఐడియా నెట్‌వర్క్‌ను 15 లక్షల మంది వైదొలిగారు. గత కొన్ని నెలలుగా వినియోగదారులను ఆకట్టుకున్న బీఎస్ఎన్ఎల్‌కు ఈసారి ఎదురుదెబ్బ తగిలింది. సంస్థ నుంచి 3.4 లక్షల మంది వైదొలగడంతో మొత్తం సంఖ్య 9.20 కోట్లకు పరిమితమయ్యారు.

జోరుగా ఎయిర్ ట్రాఫిక్

గత ఏడాది 6 శాతం పెరిగిన విమాన ప్రయాణికుల రద్దీ

న్యూఢిల్లీ, జనవరి 22: గత ఏడాది దేశీయ విమాన ప్రయాణికుల రద్దీ 6.12 శాతం పెరిగింది. 2023లో 15.20 కోట్లుగా ప్రయాణికులుంటే.. 2024లో 16.13 కోట్లుగా ఉన్నారు. ఈ మేరకు బుధవారం పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) విడుదల చేసిన అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. గత నెల డిసెంబర్‌లో 1.49 కోట్లకు పైగా ప్రయాణికులు నమోదైనట్టు స్పష్టం చేసింది. 2023 డిసెంబర్‌లో దాదాపు 1.38 కోట్లేనని వివరించింది. దీంతో 8.19 శాతం వృద్ధి కనిపించింది. కాగా, దేశంలో పెరుగుతున్న ప్రయాణికులకు తగ్గట్టుగా విమాన యాన సంస్థలు సైతం తమ విమాన సర్వీసుల సంఖ్యను పెంచేస్తున్నాయి. ఇప్పటికే భారత్.. ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న పౌర విమానయాన మార్కెట్లలో ఒకటిగా ఉన్న విషయం తెలిసిందే. డిసెంబర్‌లో ఇండిగో మార్కెట్ వాటా 64.4 శాతంగా ఉంటే, ఎయిర్ ఇండియా వాటా 26.4 శాతంగా ఉన్నది. ఇక ఆకాశ ఎయిర్, స్పైస్‌జెట్ వాటాలు 4.6 శాతం, 3.3 శాతంగా ఉన్నాయి. అలాగే ఇండిగో వన్-టైమ్ పర్మాన్స్ (ఓటీపీ) అత్యధికంగా 73.4 శాతంగా ఉన్నది. తర్వాతి స్థానాల్లో ఎయిర్ ఇండియా (67.6 శాతం), ఆకాశ ఎయిర్ (62.7 శాతం), స్పైస్‌జెట్ (61.5 శాతం), అలయెన్స్ ఎయిర్ (55.6 శాతం) ఉన్నాయి.

దావోస్‌లో పెట్టుబడుల ఒప్పందాలు

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): దావోస్‌లో జరుగుతున్న డబ్ల్యూఈఎఫ్ సదస్సు సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి రూ.56,300 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు బుధవారం జరిగాయి. వీటిలో సన్ పెట్రోకెమికల్స్ సంస్థ రూ.45,500 కోట్లతో రాష్ట్రంలో భారీ పంప్ స్టోరేజ్ జల విద్యుత్తు, సౌర విద్యుత్ ప్రాజెక్టును ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. అలాగే కంట్రోల్ ఎస్ డాటా సెంటర్స్ లిమిటెడ్ కంపెనీ రూ.10 వేల కోట్లతో హైదరాబాద్‌లో అత్యాధునిక ఏఐ (కృత్రిమ మేధ) డాటా సెంటర్ క్లస్టర్‌ను నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. దీంతోపాటు ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ హెచ్‌సీఎల్.. హైదరాబాద్‌లో కొత్తగా టెక్ సెంటర్, రాష్ట్రంలో మానవ రహిత ఏరియల్ సిస్టమ్స్ తయారీ యూనిట్ స్థాపించనున్నట్టు అమెరికాకు చెందిన జేఎస్‌డబ్ల్యూ సంస్థ ప్రకటించాయి. ఇందుకోసం రూ.800 కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నది. తెలంగాణ ప్రభుత్వంలో కుదిరిన ఆయా ఒప్పందాల ద్వారా సుమారు 10 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

మార్కెట్లోకి సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్25

దక్షిణ కొరియా స్మార్ట్‌ఫోన్ తయారీ దిగ్గజం సామ్‌సంగ్.. బుధవారం రాత్రి తమ పాపులర్ బ్రాండ్ గెలాక్సీ సిరీస్‌లో ఎస్25 మాడళ్లను ఆవిష్కరించింది. ఎస్25, ఎస్25 ప్లస్, ఎస్25 అల్ట్రా పేరిట వీటిని పరిచయం చేసింది. మరిన్ని ఆధునిక ఫీచర్లతో వచ్చిన వీటి ధరల శ్రేణి భారతీయ మార్కెట్‌లో రూ.85వేల నుంచి 1.65 లక్షల వరకు ఉంటుందని తెలుస్తున్నది. 16జీబీ ర్యామ్, గరిష్ఠంగా 1టీబీ స్టోరేజీ సామర్థ్యం వీటిలో ఉన్నాయంటున్నారు.

గోల్డ్ @ ఆల్‌టైమ్ హై

తొలిసారి రూ.82,730 పలికిన తులం ధర

న్యూఢిల్లీ, జనవరి 22: బంగారం ధర మళ్లీ ఆల్‌టైమ్ హైని తాకింది. బుధవారం దేశ రాజధాని నగరం న్యూఢిల్లీలో మునుపెన్నడూ లేనివిధంగా 24 క్యారెట్ 10 గ్రాములు రూ.82,730 పలికింది. ఈ ఒక్క రోజే రూ.630 పెరిగింది. నగల వ్యాపారులు, రిటైలర్ల నుంచి పుత్తడి కొనుగోళ్లకు డిమాండ్ కొనసాగుతుండటంతో మార్కెట్‌లో రేట్లు పరుగులు పెడుతున్నాయి. నిజానికి గత ఆరు రోజులుగా ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే ఆల్‌టైమ్ హైకి చేరాయి. ఇక అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు సైతం కలిసొచ్చాయని ఈ సందర్భంగా అఖిల భారత సరఫా అసోసియేషన్ తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నది.

3 నెలల తర్వాత..

మార్కెట్‌లో పసిడి ధరలు ఆల్‌టైమ్ హైల్లో కదలాడటం దాదాపు 3 నెలల తర్వాత ఇప్పుడే. గత ఏడాది అక్టోబర్ 31న 24 క్యారెట్ గోల్డ్ తులం రేటు తొలిసారి రూ.82,400గా నమోదైంది. అప్పట్నుంచి ఇప్పటిదాకా ఆ స్థాయిని ధరలు దాటిన దాఖలాలు లేవు. కానీ బుధవారం ఆ రికార్డు చెరిగిపోయి కొత్త రికార్డు నమోదైంది. కిలో వెండి ధర కూడా ఈ ఒక్కరోజే రూ.1,000 పుంజుకున్నది. రూ.94,000 పలికింది. ఇక గ్లోబల్ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ 10.20 డాలర్లు పెరిగి 2,769.40 డాలర్లుగా ఉన్నది. ఔన్స్ సిల్వర్ 31.58 డాలర్లు పలికింది.

హైదరాబాద్‌లో..

హైదరాబాద్‌లో 10 గ్రాముల 99.9 స్వచ్ఛత (24 క్యారెట్) పుత్తడి రేటు రూ.82,090గా ఉన్నది. మంగళవారంతో పోల్చితే రూ.860 ఎగిసింది. 99.5 స్వచ్ఛత (22 క్యారెట్) కలిగిన ఆభరణాల బంగారం ధర రూ.750 ఎగబాకి తులం రూ.75,250గా ఉన్నది. మరోవైపు మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)పై ఫ్యూచర్స్ ట్రేడ్‌లో గోల్డ్ కాంట్రాక్ట్‌లు ఫిబ్రవరి డెలివరీకిగాను రూ.299 లేదా 0.38 శాతం పెరిగింది. తులం రూ.79,523గా నమోదైంది. సిల్వర్ ఫ్యూచర్స్.. మార్చి డెలివరీకిగాను రూ.204 లేదా 0.22 శాతం ఎగిసి కిలో రూ.92,295గా ఉన్నది.

> అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాల చుట్టూ నెలకొన్న అనిశ్చితి మదుపరుల పెట్టుబడులను పుత్తడి దిశగా తీసుకెళ్తున్నది. తాజాగా ధరల పెరుగుదల వెనుక ఉన్న ప్రధాన కారణం ఇదే.
>
> -సౌమిల్ గాంధీ, హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ విభాగం సీనియర్ విశ్లేషకుడు

HDFC BANK
We understand your world

నిరాశపరిచిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

న్యూఢిల్లీ, జనవరి 22: దేశంలో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్ త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.16,736 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.16,373 కోట్ల లాభంతో పోలిస్తే 2 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.81,720 కోట్ల నుంచి రూ.87,460 కోట్లకు ఎగబాకినట్లు వెల్లడించింది.

కోలుకున్న సూచీలు

ముంబై, జనవరి 22: దేశీయ స్టాక్ మార్కెట్లు తిరిగి కోలుకున్నాయి. ట్రంప్ దెబ్బకు మంగళవారం భారీగా నష్టపోయిన సూచీలు ఆ మరుసటి రోజు ఐటీ, బ్యాంకింగ్ షేర్ల అండతో తిరిగి లాభాల్లోకి వచ్చాయి. చివరి గంటలో మదుపరులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో సెన్సెక్స్ మళ్లీ 76 వేల పైకి చేరుకున్నది. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 567 పాయింట్లు అందుకొని 76,404.99 పాయింట్లకు చేరుకోగా, నిఫ్టీ 130.70 పాయింట్లు ఎగబాకి 23,155.35 పాయింట్ల వద్ద స్థిరపడింది. తీవ్ర హెచ్చుతగ్గుదల మధ్య కొనసాగిన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో చివరి గంటలో మదుపరులు కొనుగోళ్లకు మొగ్గుచూపారని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

ఆదాయ పన్ను తగ్గాలి

బడ్జెట్‌లో మెజారిటీ ట్యాక్స్‌పేయర్స్ కోరేదిదే

గ్రాంట్ థోంటన్ భారత్ సర్వే

న్యూఢిల్లీ, జనవరి 22: రాబోయే బడ్జెట్‌లో ఆదాయ పన్ను (ఐటీ) రేట్లు తగ్గాలనే అత్యధిక వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు కోరుకుంటున్నట్టు బుధవారం గ్రాంట్ థోంటన్ భారత్ ప్రీ-బడ్జెట్ సర్వే తెలిపింది. 57 శాతం మందిది ఇదే మాట అని స్పష్టం చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టబోతున్నారు. ఈ క్రమంలో తాజా సర్వే ఫలితాలు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

ప్రోత్సాహకాలు పెరగాలి

ప్రస్తుతం వ్యక్తిగత పన్ను చెల్లింపుదారుల్లో 72 శాతం మంది కొత్త ఆదాయ పన్ను విధానాన్నే ఎంచుకుంటున్నారు. అయినప్పటికీ 63 శాతం మంది పాత ఆదాయ పన్ను విధానం కిందనున్న ప్రోత్సాహకాలు మరింత పెరగాల్సిన అవసరం ఉందని కూడా అభిప్రాయపడుతున్నట్టు సర్వే పేర్కొన్నది. ఇక కొత్త పన్ను విధానంలోనూ పన్ను రేట్లు తగ్గాలని దాదాపు 46 శాతం మంది డిమాండ్ చేస్తుండగా, ఈసారి పన్ను మినహాయింపు పరిమితుల్ని పెంచుతారన్న విశ్వాసాన్ని 26 శాతం మంది వ్యక్తం చేశారు. ఈ సర్వేలో 500 మందికిపైగా పాల్గొనగా, వ్యక్తిగత ఆదాయ పన్ను తగ్గి, వ్యక్తుల ఆదాయం పెరిగేలా రాబోయే బడ్జెట్ నిర్ణయాలుండాలని అంతా కోరుకుంటున్నట్టు గ్రాంట్ థోంటన్ వెల్లడించింది.

సర్వేలో డిమాండ్లు

- కొత్త ఆదాయ పన్ను విధానం కింద హౌజ్ ప్రాపర్టీ నష్టాలను తమ వ్యక్తిగత ఆదాయాలకు తగ్గట్టు సర్దుబాటు చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం అనుమతించాలని 53 శాతం మంది ట్యాక్స్‌పేయర్స్ కోరుతున్నారు.
- పాత ఆదాయ పన్ను విధానంలో సర్దుబాట్ల పరిమితిని పెంచాలని లేదా రూ.2 లక్షల పరిమితిని తొలగించాలని సుమారు 47 శాతం మంది ట్యాక్స్‌పేయర్స్ డిమాండ్ చేస్తున్నారు.
- నష్టాల సర్దుబాటుతో నిర్మాణ రంగంలో పెట్టుబడులకు దన్ను లభిస్తుందని మెజారిటీ వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుదారులు అభిప్రాయపడుతున్నారు.
- నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) పన్ను మినహాయింపు పరిమితుల్ని పెంచాలని, ఎన్‌పీఎస్ మొత్తాల ఉపసంహరణ నిబంధనల్ని ఇంకా సరళతరం చేయాలని, దీని వల్ల రిటైర్మెంట్ సేవింగ్స్‌కు ఊతమిచ్చినట్టు అవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
- విద్యుత్తు ఆధారిత వాహన (ఈవీ) వినియోగం పెరిగేలా వాటి కొనుగోళ్లపై పన్ను ప్రోత్సాహకాలు అందివ్వాలి.

ఎయిర్‌టెల్ ప్లాన్లపై డాటా ఎత్తివేత

న్యూఢిల్లీ, జనవరి 22: టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ నూతన మార్గదర్శకాల ప్రకారం ప్రముఖ టెలికం సంస్థ ఎయిర్‌టెల్ రెండు ప్రీపెయిడ్ ప్లాన్లలో మార్పులు చేసింది. రూ.509, రూ.1,999 ప్రీపెయిడ్ ప్లాన్లలో డాటా ఆఫర్‌ను ఎత్తివేసింది. ప్రస్తుతం అత్యధిక ప్రీపెయిడ్ ప్లాన్లు డాటాతోపాటు వాయిస్, ఎస్ఎంఎస్ కలుపుకొని ఆఫర్ చేస్తున్నాయి. టెలికం సంస్థలు ప్రత్యేకంగా వాయిస్ లేదా ఎస్ఎంఎస్ సర్వీసులు అందించే ప్లాన్లను ప్రవేశపెట్టాలని ట్రాయ్ సూచించిన విషయం తెలిసిందే. దీంతో ఎయిర్‌టెల్ కొత్తగా రెండు ప్లాన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిలో 84 రోజుల కాల పరిమితితో రూ.509 ప్రీపెయిడ్ ప్లాన్‌లో అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, 900 ఎస్ఎంఎస్‌లు అందిస్తున్నది. అలాగే రూ.1,999 ప్రీపెయిడ్ ప్లాన్ కింద 3 వేల ఎస్ఎంఎస్‌లు, అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్ అందిస్తున్న ఈ ప్లాన్ కాలపరిమితి ఏడాది.

హెచ్‌యూఎల్ లాభం 2,989 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 22: ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్..ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.2,989 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. 2023-24 ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.2,508 కోట్లతో పోలిస్తే 19.18 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.16,050 కోట్లకు చేరుకున్నది.

హైదరాబాద్-వియత్నాం మధ్య మరో విమానం

హైదరాబాద్, జనవరి 22: హైదరాబాద్-వియత్నాంల మధ్య మరో విమాన సర్వీసు అందుబాటులోకి రాబోతున్నది. మార్చి 18న ఈ నూతన సర్వీసును ప్రారంభించబోతున్నట్లు వియట్‌జెట్ ప్రకటించింది. హైదరాబాద్‌తోపాటు బెంగళూరు మధ్య ప్రారంభంకానున్న ఈ నూతన సర్వీసు సందర్భంగా ప్రారంభ విమాన టికెట్ ధర పన్నులు కలుపుకొని రూ.11గా నిర్ణయించింది. ఈ నెల 30 వరకు బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు ఫిబ్రవరి 10 నుంచి సెప్టెంబర్ 30 లోగా ప్రయాణించాల్సి ఉంటుందని తెలిపింది. దీంతో పాటు బిజినెస్, స్కైబాస్ టికెట్‌పై 20 శాతం తగ్గింపు ధరకు విక్రయిస్తున్నది. ఈ సర్వీసు కేవలం మంగళ, శనివారాలు మాత్రమే.

తిరుపతి తొక్కిసలాటపై న్యాయ విచారణ

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): వైకుంఠద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో ఈనెల 8న జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మరణించిన ఘటన తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. దీంతో ఈ ఘటనపై జ్యుడీషియల్ విచారణకు ఏపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఏపీ హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఎం సత్యనారాయణ మూర్తి నేతృత్వంలో జ్యుడీషియల్ విచారణ జరగనుంది. ఆరు నెలల్లో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు సీఎస్ విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

'ఇంద్రకీలాద్రి' ప్రధాన అర్చకుడు మృతి

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు లింగంభొట్ల బద్రీనాథ్‌బాబు కన్నుమూశారు. బుధవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో స్వగృహంలో బద్రీనాథ్ మృతిచెందారు. చాలా ఏండ్లుగా ఆయన దుర్గగుడి ప్రధాన అర్చకుడిగా సేవలందిస్తున్నారు. బద్రీనాథ్ మృతి పట్ల ఏపీ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సంతాపం తెలిపారు.

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

ముగ్గురు ఏపీ విద్యార్థులు,డ్రైవర్ మృతి

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): కర్నూలు జిల్లా మంత్రాలయం వేద పాఠశాలకు చెందిన విద్యార్థుల కారు కర్ణాటకలోని సింధనూరు సమీపంలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఏపీకి చెందిన ముగ్గురు విద్యార్థులు, డ్రైవర్ మరణించారు. ఓ విద్యార్థి పరిస్థితి విషమంగా ఉంది. మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి మఠం సంస్కృత విద్యాపీఠానికి చెందిన 14 మంది విద్యార్థులు మంగళవారం రాత్రి కర్ణాటకలోని హంపి క్షేత్రానికి సమీపంలోని శ్రీ నరహరి తీర్థుల బృందావనంలో పూజలకు బయల్దేరారు. సింధనూరు వద్ద టైర్ బోల్టులు ఊడిపోవడంతో కారు అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో విద్యార్థులు అభిలాష, హైవదన, సుజేంద్ర, డ్రైవర్ శివ మృతిచెందారు. పలువురికి గాయాలవగా క్షతగాత్రులను సింధనూరు దవాఖానకు తరలించారు. ఏపీ సీఎం చంద్రబాబు, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు.

గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మధుసూదన్‌రావు

ప్రకటించిన ఎస్జీటీయూ

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ సంఘం నుంచి గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సంకినేని మధుసూదన్‌రావును బరిలో నిలుపనున్నట్టు సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ (ఎస్జీటీయూ) ప్రకటించింది. కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, అరికెల వెంకటేశం బుధవారం హైదరాబాద్‌లో తెలిపారు. ఎస్జీటీలకు ఎమ్మెల్సీ ఓటు హక్కు లేనందున గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో ఉంచుతున్నట్టు వారు చెప్పారు.

ఆర్టీసీ సమ్మె సైరన్

- 27న కార్మికుల సమ్మె నోటీస్
- రేపు, ఎల్లుండి నిరసనలు
- ఆర్టీసీ కార్మిక జేఏసీ పిలుపు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగనుంది. 27న ప్రభుత్వానికి సమ్మె నోటీస్ ఇవ్వబోతున్నట్టు కార్మిక సంఘాలు ప్రకటించాయి. ఎంప్లాయీస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో బుధవారం రాష్ట్ర జేఏసీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షల ఎత్తివేత, 2021 నుంచి వేతన సవరణ హామీలు నెరవేర్చలేదని పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రయివేట్ పరం చేయడానికి సర్కార్ కుట్ర పన్నుతుందని విమర్శించారు. ప్రయివేట్ బస్సులతో వేలాది మంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని వాపోయారు. ప్రభుత్వానికి పర్యావరణంపై ప్రేమ ఉంటే ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీకి కొనుగోలుచేసివ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఆర్టీసీ జీతాలు ఉండాలని కోరారు. వీటిన్నింటిపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో సమ్మె బాటకు సిద్ధమైనట్టు పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కార్‌కు బుద్ధి చెప్పడానికి అన్ని జిల్లాల్లో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ కుట్రలను ప్రజా క్షేత్రంలో ఎండగడుతామని హెచ్చరించారు. రేపు, ఎల్లుండి నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు.

డిపోల ప్రైవేటీకరణ అవాస్తవం

దుష్ప్రచారాన్ని ఖండించిన టీజీఎస్ఆర్టీసీ

హైదరాబాద్, జనవరి 22 (నమస్తేతెలంగాణ) : ఎలక్ట్రిక్ బస్సుల పేరిట ఆర్టీసీ డిపోల ప్రైవేటీకరణ ప్రయత్నాలంటూ జరుగుతున్న ప్రచారాన్ని టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. కొందరు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రచారాన్ని నమ్మొద్దని సిబ్బందికి, ప్రజలకు సంస్థ విజ్ఞప్తి చేసింది. ఈ ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టంచేసింది. బుధవారం టీజీఎస్ఆర్టీసీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఎలక్ట్రిక్ బస్సుల మెయింటనెన్స్, చార్జింగ్ మినహా ఆపరేషన్స్ అంతా టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలోనే జరుగుతుందని స్పష్టంచేసింది. ఎలక్ట్రిక్ బస్సులను నేరుగా కొనాలంటే వ్యయంతో కూడుకున్నదని, ఈ నేపథ్యంలోనే కేంద్రప్రభుత్వ ఈవీ పాలసీ మేరకు గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్(జీసీసీ) పద్ధతిన.. అంటే బస్సు తిరిగే కిలోమీటర్ల ప్రకారం కంపెనీలకు చెల్లింపులు చేస్తున్నామని వివరించింది. సంస్థలో కొత్త బస్సుల కొనుగోలు జరగడం లేదనేది వాస్తవంకాదని పేర్కొంది.

ఐదారు నెలల నుంచీ పస్తులే!

- ఒకటో తేదీనే జీతాలు ఉత్త ముచ్చటే
- టీవీవీపీ కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్
- శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి అందని వేతనాలు

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులందరికీ ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పగా చెప్పుకొంటున్నది. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సైతం క్రమం తప్పకుండా వేతనాలు చెల్లిస్తున్నామని గప్పాలు కొడుతున్నది. కానీ, తెలంగాణ వైద్యవిధాన పరిషత్తు పరిధిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి ఐదారు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నా సర్కారు పట్టించుకోవడం లేదు. ఫలితంగా దాదాపు 3 వేల కుటుంబాలు పస్తులు ఉంటున్నాయి. పేషెంట్ కేర్, సెక్యూరిటీ, శానిటేషన్ బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగించారు. ఆయా ఏజెన్సీలకు ప్రభుత్వం బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ, వైద్యారోగ్య శాఖ గత ఆరు నెలలుగా బిల్లులు చెల్లించడం లేదు. దీంతో కాంట్రాక్టర్లు సిబ్బందికి వేతనాలు ఇవ్వడం లేదు. కొన్నిచోట్ల ఒకటి రెండు నెలలు ఇచ్చినట్టు చెప్తున్నారు. మొత్తంగా టీవీవీపీలో పనిచేస్తున్న దాదాపు 3 వేల మంది సిబ్బందికి దసరా నుంచి వేతనాలు లేవని, సంక్రాంతి దాటినా పరిస్థితి మారలేదని వాపోతున్నారు. నెలకు రూ.15 వేలతో కుటుంబాన్ని పోషించుకునే తమను ఇలా నిర్లక్ష్యం చేయడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెల అప్పులు చేయాల్సి వస్తున్నదని, వడ్డీల భారం పెరిగిపోతున్నదని చెప్తున్నారు. కనీసం పండుగలు కూడా చేసుకునే పరిస్థితి లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వం తమకు వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్మూర్ పసుపునకు జీఐ ట్యాగ్

- నాలుగు నెలల్లో దరఖాస్తు చేస్తాం : సైదయ్య
- పసుపును పరిశీలించిన శాస్త్రవేత్తలు

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ప్రాంతంలో పండే పసుపునకు జీఐ ట్యాగ్(భౌగోళిక గుర్తింపు) రానున్నది. దశాబ్దాలుగా ఈ ప్రాంత రైతులు ప్రధాన పంటగా పసుపును సాగు చేస్తున్నారు. విశిష్టత కలిగిన ఈ పసుపు రకానికి జీఐ ట్యాగ్ కోసం నాబార్డు సహకారంతో శాస్త్రవేత్తలు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ప్రాంతంలోని వాతావరణ పరిస్థితులు, భూమి లక్షణాలు, ఇక్కడి పసుపులో ఉండే ప్రత్యేక లక్షణాలు, సాగు చరిత్ర, డాక్యుమెంటరీ ఆధారాలపై వివరాలను సేకరించారు. స్వయంగా పొలాలను సందర్శించిన శాస్త్రవేత్తలు, సాగుచేస్తున్న పసుపు రకాల విశిష్టతను రైతులను అడిగి తెలుసుకున్నారు. జీఐ ట్యాగ్ కోసం చెన్నైలోని మేధోసంపత్తి హక్కుల కేంద్రానికి నాలుగు నెలల్లో దరఖాస్తు చేస్తామని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్, ప్రధాన పరిశోధకుడు డాక్టర్ పిడిగం సైదయ్య తెలిపారు. ఆర్మూర్ పసుపునకు భౌగోళిక గుర్తింపు వస్తే ఎగుమతులు పెరిగి, దేశవ్యాప్తంగా అధిక ధర పలుకుతుందని పేర్కొన్నారు. త్వరలోనే పసుపు డీఎన్ఏ ప్రొఫైలింగ్, నమునాలను పరిశీలించి అధ్యయనం చేయనున్నట్టు తెలిపారు. బృందంలో కమ్మర్‌పల్లి పసుపు పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు బీ మహేందర్, పీ శ్రీనివాస్, నాబార్డ్ డీడీ ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

WATCH & ENJOY RELOADED VERSION IN THEATRES
విజయవంతమైన 50 వ రోజు
మల్టిప్